నేడు TELUGU DAILY

విలేకరులు కావలెను

అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.

NEWS

9346984911
9133445456



సంచలన వార్తలకు

# నేడు

TELUGU DAILY

శనివారం | 18.04.2026 | సంపుటి : 3 | సంచిక :357 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




ఉత్కంఠ పోరులో కోల్‌కతాపై గుజరాత్ విజయం

07

# రాజ్యాంగ సవరణకు మద్దతు కరవు

**అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు**

**వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు**

**ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి**

**ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం**

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది.





## మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

**ఉత్తర దక్షిణ పేరుతో బిభజన సరికాదు**

**ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు**

**మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు**

**మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు**

**డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి**

**వారి సీట్ల పెపును అడ్డుకోవడం సరికాదు**

**లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో

-మిగతా 2 లో..



## తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాల

**30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి**

**కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి**

**2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు.**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90

-మిగతా 2 లో..



## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

**హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన**

**ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు**

టెహ్రాన్, ఏప్రిల్ 17 : ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని

-మిగతా 2 లో..



## బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు

**కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది.**

**బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు**

**మే 30వ తేదీలోగా పరిశీలన పూర్తిచేయాలని డెడ్‌లైన్**

హైదరాబాద్, ఏప్రిల్ 17 : ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి

-మిగతా 2 లో..

## ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు

**రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా**

**కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి**

**దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పడు వ్యాఖ్యలు చేస్తున్నారు.**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్

-మిగతా 2 లో..

## దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం

**ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు**

**2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి**

**లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి**

**బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య**

**చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రాహుల్ తీవ్రంగా విమర్శలు**

**రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా.. కేంద్రమంత్రులు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా

-మిగతా 2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) 10 |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹70

## పేరు, ఫోటో వాడకుండా చూడండి

**ఢిల్లీ కోర్టులో అల్లు అర్జున్ కేసు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను ఎవరూ వాడకూడదని కోరుతూ.. ఒక పిటీషన్ దాఖలు చేశారు. తన పేరు, ఫోటోలను ఉపయోగించుకుని పలు ఉత్పత్తులను విక్రయిస్తూ

-మిగతా 2 లో..





## బాలికపై లైంగిక వేధింపులు

**నిందితుడిని పోలీసులకు అప్పగించిన వారికి సన్మానం**

**ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం**

**పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్**

హైదరాబాద్, ఏప్రిల్ 17 : తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో

-మిగతా 2 లో..



## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

**ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో**

**కేటీఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత**

**ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం**

**జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

20

# వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ పక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

## మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. దిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ పక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకమనే విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. వారిది మహిళా వ్యతిరేక మైండ్‌సెంట్ అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రభుత్వాన్ని నమ్మాలని అన్నారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను విస్తరించేందుకు, వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముందుకు వెళ్తున్నామని చెప్పారు. మూడు బిల్లులపై లోక్‌సభలో సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయని, ఇండియా కూటమి సభ్యుల్లో చాలామంది మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ సవరణ వల్ల దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం బలహీనమవుతుందనడంలో ఎంత మాత్రం నిజం లేదని అమిత్‌షా వివరించారు. బిల్లు ఆమోదం తర్వాత దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, శాతం రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రస్తుతం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో దక్షిణాదిన 129 మంది ఎంపీలు ఉన్నారని, అది 195కు పెరుగుతుందని చెప్పారు. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం పెరగడం వల్ల బలమైన గొంతు వినిపించే అవకాశం ఉంటుందని వివరించారు.

## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

(మొదటిపేజీ తరువాయి)

లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా–ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్–ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగను న్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.




## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

## దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)

మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకు రండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానిం చడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధానమంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం



జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలనుకున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

(మొదటిపేజీ తరువాయి)

ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం



సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపో యి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణకు కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

## పేరు, ఫోటో వాడకుండా చూడండి

(మొదటిపేజీ తరువాయి)

డబ్బు సంపాదించుకుంటూ తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా చేస్తున్న వారికి ఈ కేసు వర్తిస్తుందని, తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టులో అల్లు అర్జున్ దావా వేశారు. శుక్రవారం జస్టిస్ తుషార్ రావు కమిటీ నేతృత్వంలో ఈ కేసు విచారణకు రానుంది. ఇదే అంశంలో ఇప్పటికే చిరంజీవి , మోహన్ లాల్ , నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, ఐశ్వర్య రాయ్, తదితరులు తమ వ్యక్తిత్వ హక్కులను కాపాడాలంటూ కోర్టును కోరిన సంగతి విదితమే. ఈ కేసులలో సినీ ప్రముఖుల ప్రైవసీ హక్కులను రక్షించకపోతే వారికి సరిదిద్దలేని నష్టం జరుగుతుందని న్యాయస్థానం స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చింది.

## బాలికపై లైంగిక వేధింపులు

### నిందితుడిని పోలీసులకు అప్పగించిన వారికి సన్మానం


(మొదటిపేజీ తరువాయి)

సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ – 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# మనస్సాక్షిగా బిల్లుకు మద్దతు ఇవ్వండి

- మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం
- మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం
- ఎంపీలకు ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు.



నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నింటినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే పక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి' అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

## భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదు


### పాక్‌ను హెచ్చరించిన విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లుపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. దేశంలోని పరిపాలనా, శాసనపరమైన పక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశపెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ పేర్కొన్నారు.

## తలనొప్పి తెచ్చేలా రాహుల్ ప్రసంగం

- పార్లమెంట్‌ను హేళన చేసేలా ప్రవర్తన
- బిజెపి ఎంపి కంగనా రనౌత్ విమర్శలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగం వినడం తలనొప్పిగా మారిందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాహుల్ ప్రసంగం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, అసలు విషయాలను రాహుల్ పక్కనపెట్టి తన వ్యక్తిగత విషయాలు, బాల్యం ముచ్చట్లు చెప్పడం తనకు తననొప్పి కలిగించిందని అన్నారు. ఆయన ప్రసంగం ఒక న్యూసెన్స్‌లా ఉందని, స్పీకర్ కూడా పార్లమెంటరీ ప్రమాణాలకు లోబడే మాట్లాడాలని రాహుల్‌కు చెప్పారని అన్నారు. రాహుల్ ప్రవర్తన పార్లమెంటును హేళన చేసేలా ఉందని కంగనా రనౌత్ విమర్శించారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో డీలిమిటేషన్ బిల్లుపై విమర్శలు గుప్పించారు. ఇందువల్ల మహిళా సాధికారతకు ఒరిగేదేమీ ఉండదన్నారు. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను మార్చే ప్రయత్నమే జరుగుతోందని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇది కులగణనను బైపాస్ చేసే ప్రయత్నమేనని చెప్పారు.

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

- కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం
- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం
- మంత్రి పొన్నం లేఖపై డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్- పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

## తేజస్వీ వ్యాఖ్యలు

### పార్లమెంట్ ముందు ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయిచారు. తెలంగాణ ఏర్పాటును భారత్ – పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేం నరేందర రెడ్డి, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి స్వల్ప భూప్రకంపనలు

**అనకాపల్లి, ఏప్రిల్ 17 :** అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి సమయంలో స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. గురువారం రాత్రి 12 గంటల 30 నిమిషాల సమయంలో కొన్ని సెకన్ల పాటు ఈ ప్రకంపనలు సంభవించినట్లు అనకాపల్లి ప్రజలు చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా ప్రజల్లో భయాందోళన ఏర్పడింది. అనకాపల్లి పట్టణం పరిసర ప్రాంతాలతో పాటు సమీప గ్రామాల్లో కూడా ప్రకంపనల ప్రభావం కనిపించినట్లు సమాచారం. ఇళ్లలోని కొన్ని సామాగ్రి స్వల్పంగా కదిలినట్లు స్థానికులు తెలిపారు. కొంతమంది నిద్రలో ఉండగానే మంచాలు, ఫర్నిచర్ స్వల్పంగా కంపించినట్లు చెప్పారు. ప్రకంపనలు తక్కువ స్థాయిలో ఉండటంతో ఎలాంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని సమాచారం. అయితే అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు ఇళ్ల బయటకు వచ్చి పరిస్థితిని గమనించారు. ఇప్పటివరకు ఈ భూప్రకంపనలపై అధికారికంగా ఎలాంటి నమోదు కాలేదని తెలుస్తోంది. భూకంప పరిశీలనా కేంద్రాల నుంచి కూడా ఇంకా స్పష్టమైన సమాచారం వెలువడాల్సి ఉంది.

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

- నిబంధనలు సడలించిన తెలంగాణ ప్రభుత్వం
- రియల్ వ్యాపారులకు వరం కానున్న జివో 168

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి విమానాశ్రయాల పరిసరాల్లో భవన నిర్మాణాలపై ఉన్న ఆంక్షలను సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012లో మార్పులు చేస్తూ జీవోఎంఎస్ నంబర్ 168 ద్వారా సవరణలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ విమానాశ్రయాల పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ నాయిస్ జోన్ నిబంధనలలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. ÷మానాల రాకపోకల వల్ల కలిగే శబ్ద కాలుష్యం దృష్ట్యా, గతంలో నిర్మాణాలపై కఠినమైన నియంత్రణలు ఉండేవి. అయితే, మారుతున్న పట్టణాభివృద్ధి అవసరాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. నాయిస్ జోన్ ప్రభావిత ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం ఇప్పుడు మరింత స్పష్టతనిచ్చింది. నాయిస్ జోన్ కిందకు వచ్చే ప్రాంతాల్లో భవనాల ఎత్తు, రకానికి సంబంధించి గతంలో ఉన్న కొన్ని అడ్డంకులను తొలగించారు. విమానాల శబ్దం వల్ల నివాసితులకు ఇబ్బంది కలగకుండా, భవన నిర్మాణంలో ధ్వని నిరోధక ప్రమాణాలను పాటించడాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, రియల్ ఎస్టేట్ వృద్ధికి ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి భవనాలు నిర్మించవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ ఉత్తర్వుల వల్ల ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ప్రాంతాల్లో భూముల విలువ పెరగడంతో పాటు, నిర్మాణ రంగంలో పారదర్శకత పెరుగుతుంది. నిబంధనల్లో స్పష్టత రావడం వల్ల మున్సిపల్ అధికారుల వద్ద ప్లాన్ అప్రూవల్స్ త్వరగా పొందే అవకాశం ఉంది. గతంలో నాయిస్ జోన్ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యేవి. తాజా సవరణలతో ఆ సమస్యలు తొలగిపోనున్నాయి. శంషాబాద్, పరిసర ప్రాంతాల్లో కొత్త వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఈ జీవో మార్గం సుగమం చేస్తుంది. విమానాశ్రయ పరిసరాల నియంత్రణ, పౌర భద్రతను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న తరుణంలో, ఇలాంటి సవరణలు నగరం అన్ని వైపులా విస్తరించడానికి దోహదపడతాయి.

## రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

### కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి నేను కొన్ని సూచనలు చేస్తున్నా. మంత్రిత్వ శాఖలో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయాలి. ప్రధాని పదవిని కూడా రొటేషన్ పద్ధతిలో మహిళలకు రిజర్వ్ చేయాలి. ఎందుకంటే 2029 ఎన్నికల్లో భాజపా అధికారంలోకి రాదని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

## తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని శవం

### మూడు నెలలుగా పడివుండడంతో కుళ్లిన దేహం
### స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత విషాదకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. మూడు నెలలుగా తాళం వేసి ఉన్న ఇంట్లో శవం దొరకడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గతంలో ఒక వ్యక్తి అద్దెకు ఉండేవారు. అయితే, గత మూడు నెలలుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. అ÷-దదెదారు కనిపించకపోవడం, కనీసం ఇంటి యజమానికి అ÷-దదె కూడా చెల్లించకపోవడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఇంటి యజమాని వచ్చి తాళం విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా, ఇల్లు మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. లోపలికి వెళ్లి వెతకగా, వంటగదిలోని కిచెన్‌లో కింద గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే నేరేడ్‌మెట్ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో, అది పురుషుడిదా లేక మహిళదా అనేది కూడా ప్రాథమికంగా గుర్తించలేనంత దారుణంగా ఉంది. శవం కిచెన్ బండ కింద ఉంచడాన్ని చూస్తే, ఇది ఓ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్య అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా చంపి అక్కడ దాచిపెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఆ ఇంట్లో నివసించిన వ్యక్తి ఎవరు..?, అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాలనీలో ఉన్న సీసీటీవీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గత మూడు నెలల్లో ఆ ఇంటికి ఎవరెవరు వచ్చారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. జనసంచారం ఉండే కాలనీలో, అది కూడా మూడు నెలల పాటు ఇంట్లో శవం ఉండటం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది.

## మద్యం కేసులో వాసుదేవరెడ్డికి బెయిల్

**విజయవాడ, ఏప్రిల్ 17 :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఏ2 నిందితుడు వాసుదేవ రెడ్డికి ఏసీబీ కోర్టు శుక్రవారం)బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2, 4 సోమవారాల్లో విచారణ అధికారుల ఎదుట హాజరవ్వాలని, పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదే కేసులో మరో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు డిస్మిస్ చేసింది. ఇదే కేసులో మరో ముగ్గురు నిందితులు ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్ రెడ్డిల రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసింది. ఈ తీర్పును ఏప్రిల్ 24వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

### లోయలో పడ్డ వ్యాన్.. పదిమంది దుర్మరణం

**చెన్నై, ఏప్రిల్ 17 :** తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.



## ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన గురుకుల బిసి విద్యార్థులకు సన్మానం

### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** బీసీ గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు, ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. బీసీ విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్దిదారుల ఎంపికపై సమావేశంలో మాట్లాడామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు చేరాలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచాలను.. శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ప్రజలకు మరింత భారంకానున్న సీట్ల పెంపు!



**మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబడాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది.**

ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడవుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతు న్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి.

డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ది కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు.

ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ÷ూజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

**కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సీఎం**

**మరోమారు మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటి తుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

## రెండోరోజూ నల్లదుస్తులతో డిఎంకె సభ్యులు

**ఆదరాబాదరాగా చట్టాలను తేవడంపై కనిమొళి అభ్యంతరం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** మహిళా రిజర్వేషన్ అమలు, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటులో రెండోరోజు చర్చ ప్రారంభమైంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ సాగుతోంది. ప్రభుత్వ తీరుపై మరోసారి ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎమ్‌కే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. డిఎంకె ఎంపిలు వంససగా రెండో రోజూ నల్లదుస్తులతో సభకు హాజరయ్యారు. హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఈ సందర్భంగా కనిమొళి అన్నారు. రోజుల వ్యవధిలో బిల్లులు ఆమోదింపచేసుకోవాలనే ప్రయత్నంలో రాజకీయ లెక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇది అసలైన సమాఖ్య స్ఫూర్తి కాదని అన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తిం చట్లేదని అన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. కేంద్రం చర్యలపై మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేష న్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. మహిళా బిల్లుకు అభ్యం తరం లేదని, కేవలం డీలిమిటేషన్ విషయంలోనే ఇంత తొందరెందుకని ప్రశ్నించారు. కావాలంటే ఉన్న సీట్లతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.



## తేజస్వీ మాటల్లో తప్పేముంది

**మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

# శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

**ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్‌ఎంసీ నిర్మించింది. జీహెచ్‌ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ఫ్లై ఓవర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.



## దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం

**డీలిమిటేషన్ పక్రియపై శశిథరూర్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** పార్లమెంట్‌లో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ తీవ్రరూపం దాల్చింది. జనాభా ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ పక్రియకు సంబంధించి చొరవ తీసుకుంటోంది. అయితే డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా డీలిమిటేషన్ బిల్లుపై చర్చ కొనసాగింది. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నారని, వారి మాటలకు విరుద్ధంగా డీలిమిటేషన్ బిల్లు రూపొందించారని ఆయన విమర్శించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా మరింత నష్టపోతాయని శశిథరూర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం మంచిదేనని, అయితే దీని అమలకు 2011 జనాభా లెక్కలకు, నియోజకవర్గాల పునర్విభజన పక్రియకు ముడిపెట్టడారని ఆయన విమర్శించారు. ఒకేసారి 816 మంది సభ్యులకు సీట్లు పెంచడం ఆషామాషీ కాదన్నారు. దీంతో ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు లోక్ సభలో ఈ మూడు బిల్లుల ఓటింగ్ ఉత్కంఠ రేపుతోంది. సాయంత్రం 4 గంటలకు స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ చేపట్టనున్నారు. విపక్షాల్లోని పలు పార్టీలతో ఎన్డీయే నేతలు మంతనాలు చేస్తున్నారు. మరోవైపు ఓటింగ్ వేళ ఇండియా కూటమి వ్యూహరచన చేపట్టింది. ఇండియా కూటమికి భేటీకి ఆర్జేడీ హాజరుకావడంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక్కొక సభ్యుడు ఉన్న పార్టీలను కూడా ఈ కూటమి సంప్రదిస్తోంది.

# పోలవరం పరిసరాల్లో పెద్దపులి సంచారం

**భయాందోళనలో ప్రాజెక్ట్ కార్మికులు**



**పోలవరం, ఏప్రిల్ 17 :** పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమైన కార్మికుల కంట ఈ పులి పడటంతో భయాందోళన నెలకొంది. పెద్ద పులిని నేరుగా చూసిన కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. జనసంచారం ఉన్న ప్రాంతంలోకి పులి రావడంతో ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందన్న భయంతో కార్మికులు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ సమాచారం అందగానే ప్రాజెక్ట్ అధికారులు, అటవీ శాఖ అప్రమత్తమయ్యారు. రంగంలోకి దిగిన అటవీ శాఖ అధికారులు పులి మెడలో 'రేడియో కాలర్' ఉండటాన్ని గుర్తించారు. దీని సహాయంతో పులి ప్రస్తుతం ఎక్కడ ఉంది? ఏ దిశగా వెళ్తోంది? అనే అంశాలను శాటిలైట్ సిగ్నల్స్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తున్నారు. పెద్దపులికి మత్తుమందు ఇచ్చి బంధించేందుకు రాజమండ్రి నుంచి ప్రత్యేక అనస్థీషియా నిపుణుల బృందం పోలవరానికి చేరుకుంది. పులి సంచరించే అవకాశం ఉన్న మార్గాల్లో బోన్లను ఏర్పాటు చేయడంతో పాటు, అటవీ సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మికులు ఒంటరిగా తిరగవద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



## కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్లు

**త్వరలో సుందరీకరణ పనుల ప్రారంభం : మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్/ కాప్రా, నేడు న్యూస్:** కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్ల నిధులు మంజూరైనట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ నిధులతో చెరువులో అభివృద్ధి, సుందరీకరణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణ, పరిసరాల అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. కాప్రా చెరువును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులు రూ.20 కోట్లతో తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. అదేవిధంగా నాచారం హెచ్ఎంటీ నగర్ చెరువు అభివృద్ధికి రూ.30 కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువుకు రూ.17 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా, సాగునీటి శాఖ అధికారులు, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, సింగిరెడ్డి ధన్పల్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విట్టల్ నాయక్, పావని రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారామ్ రెడ్డి, పోచయ్య గౌడ్, డివిజన్ అధ్యక్షులు నాగశశు, కాశట్టి ప్రసాద్, అంజయ్య, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, కాప్రా సాయి, డీసీసీ కార్యదర్శి మారుళి, సురేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూర్ణ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అజీజ్, బాబు రావు, శ్రీహరి, సత్యనారాయణ, టిల్లు యాదవ్, రాకేష్ యాదవ్, కొబరినోరి నాగరాజు, శ్రీధర్ రెడ్డి, వినోద్, మల్లా రెడ్డి, ముర్తజా, బుట్టల శ్రీను, సతీష్ యాదవ్, ప్రదీప్, సిద్ధిఖీ, చోటు భాయ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రతి వారం "ఫ్రైడే డ్రై డే" నిర్వహించాలి

**పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ, మలేరియా నియంత్రణ : డీసీ శ్రీహరి**

**ఉప్పల్/ కాప్రా, నేడు న్యూస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99లో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలోని కేసీఆర్ కాలనీలో శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీ శ్రీహరి, డీఈ రవీందర్, ఏఈలు, ఎంటమాలజీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ శ్రీహరి మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి వారం ఒకరోజు "ఫ్రైడే డ్రై డే"గా నిర్వహించి ఇళ్లలో నిల్వ ఉండే నీటిని తొలగించాలని సూచించారు. కాలనీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్ మాట్లాడుతూ, ఎండాకాలంలో కూలర్లు విస్తృతంగా వినియోగిస్తారని, కూలర్లలో నిల్వ ఉండే నీటిని రెండు రోజులకు ఒకసారి మార్చుకుంటే దోమల పెరుగుదల తగ్గి వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమం అనంతరం అధికారుల బృందం కాలనీలోని పలు ఇళ్లను సందర్శించి కూలర్లను పరిశీలించింది. కూలర్లలో ఉన్న దోమల లార్వాను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

**దేవరుప్పుల నేడు న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలోని 15.25లక్షల ఉద్యోగుల యొక్క 206 సంఘాలకు సంబంధించిన తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల గెజిటెడ్ అధికారుల,కార్మిక సంఘాల(ు+జుజీూజ) ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ సమస్యల సాధనకై దేవరుప్పుల మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసిల్దార్ అశ్వక్ అహ్మద్ గారికి వినతిపత్రాన్ని అందజేశారు.పిఆర్సి కమిషన్ రిపోర్ట్ తెప్పించి జూన్ 2లోపు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని,ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని,కాంట్రిబ్యూషన్ పెన్షన్ రద్దు చేసీ పాత పెన్షన్ స్కిం ను పునరుద్ధరణ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ు౹ుఖ మండల శాఖ అధ్యక్షులు తిరుపతి రెడ్డి,ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వీూ వెంకటేష్, సూపరింటెండెంట్ పుష్పలత, గ్రామ కార్యదర్శులు,వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శ్రీనివాసచారి, సత్తయ్య,శ్రీనివాస్,సోమరాజు, మదన్ మోహన్ రెడ్డి ,జ్యోతి ఖాజా,శివప్రసాద్ నర్సింహ్మ నాయక్,వెంకటేష్, ఆంజనేయులు,రాజు, నవీన్, తదితరులతో పాటు నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.



## నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి

**దేవరుప్పుల నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలంలో ఉపాధి కోసం చూసే వారికి ఆసరాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గానికి ఎగ్ కార్ట్స్ కావాలని చీజుజజ చైర్పర్సన్ అనురాధ దేశాయ్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి నియోజకవర్గం మొత్తంగా సుమారు 110 ఎగ్ కార్టులు పంపిణీ చేశారు.అందులో భాగంగానే దేవరుప్పులలో నేడు 25 ఎగ్ కార్టులు పంపిణీ చేయగా ప్రారంభించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి. ఈ ఎగ్ కార్ట్స్ ద్వారా చిరు వ్యాపారులు ఉపాధి అవకాశం కల్పించే అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల,గ్రామ బిఆర్ఎస్ నాయకులు,యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభిరుచికి తగిన విధంగానే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి
- నాగోలు లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన
- విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్



**మేడ్చల్, నేడు బ్యూరో :** విద్యార్థినులు ఎంచుకునే లక్ష్యం ఏదైనా సరే వ్యక్తిగత ఆసక్తి, అభిరుచి ఆధారంగా నిర్ణయించుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు ఉద్బోధించారు. మేడ్చల్ జిల్లా నాగోల్ లో నిర్వహిస్తున్న ( బాలానగర్) తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ (బాలికలు) స్కూల్‌ను కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ, మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. వసతి గృహంలో అందుతున్న బోధన తీరుపై కలెక్టర్ ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడుతూ, చదువుతో పాటు ఇష్టమైన స్పోర్ట్స్, గేమ్స్, మీ అభిరుచులలో కూడా మీ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన శిక్షణను అందించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని పేర్కొన్నారు. మీ పై మీకు ఆత్మవిశ్వాసం ఉండాలని, బిడియాన్ని వదిలి, మీకు తెలిసిన విషయాన్ని నలుగురిలో చర్చించగలగాలని, అప్పుడే మీ పై మీకు నమ్మకం కలుగుతుందన్నారు. చదువుతో పాటు కొత్తగా వస్తున్న శాస్త్ర, సాంకేతిక టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. ఎక్కువ శ్రమ పడకుండా స్మార్ట్ వర్క్ చేయాలని, తద్వారా టైమ్ సేవ్ అవుతుందన్నారు. ప్రస్తుతం చాట్ జిపిటి, జెమిని, పెర్ప్లెక్సిటి వంటి ఏఐ టూల్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఈ ఏఐ టూల్స్ ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోండి, అవి మీ భవిష్యత్తులో ఎల్లప్పుడూ తోడ్పడతాయని, ఆత్మవిశ్వాసంతో ఉండాలంటే మీకు సబ్జెక్ట్ మీద అవగాహన ఉండాలని, సబ్జెక్ట్ అంటే కేవలం అకాడమిక్స్ మాత్రమే కాదని, ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకొని ఆ అంశం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని అందులో నైపుణ్యతను పొంది మీ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ మను చౌదరి అమ్మాయిలకు సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే విధంగా మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో రాజేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కాంతమ్మ, తహసిల్దార్ పూల్ సింగ్, ప్రిన్సిపల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి ఫ్యామిలీ కోర్టులో కొత్త జడ్జీలు బాధ్యతల స్వీకారం

**బార్ అసోసియేషన్ సభ్యుల శుభాకాంక్షలు**



**ఉప్పల్/ కుషాయిగూడ, నేడు న్యూస్:** మేడ్చల్--మల్కాజిగిరి ఫ్యామిలీ కోర్టులో కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా రాచపూడి శ్రీదేవి, అదనపు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా కె. ఉమాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఇద్దరు న్యాయమూర్తులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోర్టు వ్యవహారాలు సమర్థవంతంగా సాగేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్తయ్య, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రసన్న, సంయుక్త కార్యదర్శి రవిశంకర్, మహిళా సంయుక్త కార్యదర్శి జలజ, కోశాధికారి పుణ్యరాజు, లైబ్రరీ కార్యదర్శి సాయినాథ్ గౌడ్, క్రీడలు--సాంస్కృతిక కార్యదర్శి పవన్ కుమార్ బి.ఎన్, లేడీ ప్రతినిధి సుజాత, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నవనీత్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బద్రీనాథ్, రాకేష్ ఎన్, నరేందర్, నరేష్, శోభారాణి, విమల తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణకు ఏర్పాట్లు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్‌కు ఆహ్వానం**
**వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో శ్రీరస్తు కన్వెన్షన్‌లో వేడుకలు**

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్) ఆధ్వర్యంలో 2026--27 సంవత్సరానికి సంబంధించిన నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 19న ఉప్పల్ భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌ను ఆహ్వానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని, ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు.



## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**మందుముల పరమేశ్వర్ రెడ్డి**




**ఉప్పల్/ కాప్రా, నేడు న్యూస్:** వేసవి వేడిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు కాప్రాలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రశంసనీయం అని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా--ధమ్మాయిగూడ ప్రధాన రహదారిపై కాప్రా డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లం రాకేష్ యాదవ్ తన తండ్రి అల్లం కృష్ణ యాదవ్ స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీరు అందించడం గొప్ప సేవ అని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీతారాం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నాగశేషు, రాజేందర్, అల్లం నాగరాజు, అల్లం సుధాకర్, అల్లం పూర్ణ, అల్లం సాయి కిరణ్, అల్లం మల్లేష్, అల్లం హరికృష్ణ, అల్లం శంకర్, అల్లం సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు విఠల్ నాయక్, పూర్ణ యాదవ్, రాజు, డి మురళీ, కొబ్బనూరి నాగరాజు, పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, బాబురావు, ఓర్ల శ్రీధర్ రెడ్డి, నరేందర్ గౌడ్, వినోద్ కుమార్, సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, సతీష్ యాదవ్, తోటకూర శ్రీకాంత్, సంతోష్ చారి, ఆడెపు శ్రీనివాస్, జగదీష్, కె రాజు, అల్లం సాయి కుమార్ యాదవ్, నాగరాజు యాదవ్, శంకర్ యాదవ్, ప్రదీప్, మూర్తుజా తదితరులతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ గౌడ్, మనోజ్ కుమార్, దయాకర్, యశ్వంత్, ఇమ్రాన్, శివ, భరత్ పాల్గొన్నారు.



## సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్‌కి సత్కారం

**సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభకు ఘనంగా గుర్తింపు**

**హైదరాబాద్, నేడు న్యూస్:** సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగంలో అభ్యసిస్తున్న విద్యార్థి బి. సాయికిరణ్ ప్రతిభతో మరోసారి గుర్తింపు పొందారు.గత సంవత్సరం డిసెంబర్‌లో చెన్నైలో నిర్వహించిన సౌత్ జోన్ ఫెస్టివల్ లో సాయికిరణ్ వన్ యాక్ట్ ప్లే, మైమ్, క్రియేటివిటీ కొరియోగ్రఫీ విభాగాల్లో పాల్గొన్నారు. అందులో వన్ యాక్ట్ ప్లేలో నాలుగో స్థానం సాధించగా, మైమ్‌లో ప్రధాన పాత్ర పోషించి నాలుగో స్థానం పొందారు.ఈ సందర్భంగా గురువారం రోజు సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు చేతుల మీదుగా సాయికిరణ్ సర్టిఫికెట్లు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు,రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతు రావు, సినీ నటుడు ప్రదీప్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కృపాకర్ పాల్గొన్నారు. విద్యార్థి సాయికిరణ్ సాధించిన విజయానికి విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ విభాగాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

**మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్**



**వలిగొండ, నేడు న్యూస్:** నిన్న జరిగిన పార్లమెంటు సమావేశాల్లో బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్తో పోల్చడం సరైనది కాదని మలిదశ ఉద్యమకారుడు టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ హెచ్చరించారు. అతని అవగాహన లేని తనానికి నిదర్శనమని ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఆంధ్ర దోపిడికి వ్యతిరేకంగా ఆత్మ గౌరవం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించామన్నారు అనేక బలిదానాలతోటి త్యాగాలతోటి ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగబద్ధంగా పార్లమెంటులో ఆమోదం పొందిన తర్వాతనే రాష్ట్రాన్ని సాధించామన్నారు తొలి దశ ఉద్యమంలో 369 మంది అమరవీరులు నేల కొరిగారని మలిదశ ఉద్యమంలో 1200 మంది బలిదానాలు చేసుకున్నారని అనేకమంది త్యాగాలు చేశారని ఆయన గుర్తు చేశారు వెంటనే తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.



## బొందుగుల రమేష్‌కు ఆర్థిక సాయం

**దేవరుప్పుల నేడు న్యూస్:** దేవరుప్పుల మండలకేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది బొందుగుల రమేష్ గత కొన్ని రోజులుగా వెన్నునొప్పితో బాధపడుతూ హైద్రాబాద్ లోని ప్రయివేట్ ఆసుపత్రిలో వెన్నెముక ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకొని ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారికి 5000 ఆర్థిక సాయం అందజేసిన దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట వార్డు సభ్యులు చిలుకూరి నరసయ్య,గోడిశాల శ్రీనివాసు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కారుపోతుల సోమయ్య,జోగు ముత్తయ్య,బోనగిరి కిష్టయ్య,రెడ్డి రాజుల కిష్టయ్య,కొంగ అశోక్,చింత ఎల్లయ్య,పాము యాకన్న,ఉప్పుల బాబు,చింత ఐలయ్య,కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కారుపోతుల యాకస్వామి,కారు-పోతుల నరేష్,ఆకుల రాజశేఖర్,ఆకుల సంతోష్,కారుపోతుల సతీష్,పత్తేపురపు శేఖర్,తోటకూరి సందీప్,తోటకూరి మహేష్,చిలుకూరి ఉమేష్,లొడంగి రాజు,చింత సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలుపై ఆరాతీసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి..

**దేవరుప్పుల నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతున్నది? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదని,కేంద్రంలో వడ్లు అరబోసి 10 రోజులు అయినా కూడా అధికారులు ఎవరు కూడా వడ్లు కొనుగోలు చేయడంలేదని రైతులు ఎర్రబెల్లి దృష్టికి తీసుకొచ్చారు.దీంతో వెంటనే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో చరవాణి మాట్లాడి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం చేసి రైతన్నలు పండించిన ధాన్యాన్ని తీసుకెళ్లడానికి లారీలు,కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈ రోజు నుండే దేవరుప్పుల మండలంలో ఉన్న కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మండల బిఆర్ఎస్ నాయకులు,యువజన నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అశోక్‌నగర్ కాలనీలో విద్యుత్ లో-వోల్టేజీ చెక్

### 360కెవి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసిన విద్యుత్ అధికారులు


**బోడుప్పల్, నేడు న్యూస్:** సర్కిల్ పరిధిలోని అశోక్ నగర్ కాలనీ విద్యుత్ లో–వోల్టేజ్ సమస్యకు చెక్ పడింది. గత కొంతకాలంగా కాలనీలో విద్యుత్ లో–వోల్టేజ్ సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ కు స్థానిక కాలనీ అధ్యక్షుడు సమస్యను తెలియజేశారు. ఆయన సూచనతో శుక్రవారం విద్యుత్ అధికారులు 160 కె.వి ట్రాన్స్ఫార్మర్ ను తొలగించి దాని స్థానంలో 360 కే.వి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో అశోక్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బుచ్చిదాస్ గౌడ్ బోడుప్పల్ విద్యుత్ ఏఈ, డిఇ ఈ, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ పిల్లలకు పోషక ఆహారం అందించాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్

**మేడ్చల్, నేడు బ్యూరో:** జిల్లాలోని అంగన్వాడీ పిల్లలకు పోషక ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని శారద, సీడీపీవోలు, అంగన్వాడీ టీచర్స్ ను ఆదేశించారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ పట్టణంలో శుక్రవారం స్థానిక ఐ.సీ.డి.ఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ లో అంగన్వాడీ టీచర్స్ కు మొబైల్ ఫోన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా అంగన్వాడీ టీచర్స్ మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో పోషన్ పక్వడా కార్యక్రమం నిర్వహిస్తున్నందున గర్భిణీలు, తల్లీ, బిడ్డలు పోషక ఆహారం ఏ విధంగా తీసుకోవాలో వివరంగా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్ మేడ్చల్ ఐ.సీ.డీ.ఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ లో పిల్లలకు అక్షర అభ్యాసం చేయించారు. అన్న ప్రాసన చేశారు. గర్భిణీలకు నిర్వహించిన శ్రీమంతం నిర్వహణ తదితర కార్యక్రమాలలోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి శారద తదితరులు పాల్గొన్నారు.



## మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

**దేవరుప్పుల నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలకేంద్రంలో మూడు రోజులుగా శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఉత్సవాలు జరుగుతుండగా నిన్న సాయంత్రం స్వామి వారి కళ్యాణమహోత్సవం జరుగగా ఈ రోజు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వారి ఆశీస్సులతో నియోజవర్గ ప్రజలను సంతోషంగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ పూజారి పెద్దాపురం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ మంత్రిని ఘనంగా సన్మానించారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేష్,గ్రామ శాఖ అధ్యక్షుడు లొడంగి వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు చింత మల్లయ్య,బలరాం,బిఆర్ఎస్ నాయకులు ఏల సుందర్,ఉప సర్పంచ్ నర్రా కోమలత,కొల్లూరి సోమయ్య,జోగు సోమ నర్సయ్య,సుడిగేల హన్మంత్,ఆలకుంట్ల యాదగిరి,తోటకూరి దశరథ,వేల్పుల చంద్రప్రకాష్,రెడ్డిరాజుల అబ్బసాయిలు, గొడిశాల మల్లేష్,భాషిపాక అబ్బయ్య,చింత యాదగిరి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న బిఆర్ఎస్ నాయకులు

- మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టకు భ్రమరాంబిక తల్లికి ఆహ్వానం
- శివకుమార్ గౌడ్, మహేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** శ్రీశైల మల్లికార్జున భ్రమరాంబిక అమ్మవారిని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దర్శించుకున్నారు. శుక్రవారం అమావాస్య సందర్భంగా నాగారం ఓల్డ్ విలేజ్ శ్రీకోట మైసమ్మ తల్లి నూతన ఆలయంలో అమ్మవారి పున:ప్రతిష్ట మహోత్సవానికి శ్రీశైల మల్లన్న భ్రమరాంబిక తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీశైల మల్లికార్జున స్వామి భ్రమరాంబికల కటాక్షంతో యుద్ధాలు ఆగిపోయి,రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్,మాజీ గౌడ సంఘ అధ్యక్షులు మహేష్ గౌడ్,జనగామ జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా రంగంలో మహిళల ప్రాధాన్యత పెరగాలి

- చిన్న మధ్య తరహా పత్రికలను ప్రోత్సహించాలి
- పాత్రికేయ వృత్తిలో విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య



**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** మీడియా రంగంలో మహిళలకు మంచి అవకాశాలున్నాయని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని పాత్రికేయ వృత్తిలో రాణించాలని సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో మహిళా జర్నలిస్టు యాదమ్మ నేతృత్వంలో వెలువడుతున్న "జన సమయం" పక్ష పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. ఒకప్పుడు ప్రింట్ పత్రికలకే పరిమితమైన మీడియా రంగం ఇప్పుడు ఎలక్ట్రానిక్ రంగంతో విస్తరించి సమాచారం వేగవంతమైందని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో వచ్చిన టీవీ, సోషల్ మీడియా, యూట్యూబ్, డిజిటల్ మీడియా వల్ల పత్రిక రంగం ప్రజాదరణ కోల్పోకుండా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, మధ్య తరహా పత్రికలను ప్రోత్సహించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పత్రికల పట్ల కక్షసాధింపు ధోరణి అవలంభిస్తుందని, ఈ వైఖరి సరైంది కాదని అన్నారు. పాత్రికేయ వృత్తిలో విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పవిత్రమైన జర్నలిజం వృత్తిని అపవిత్రం చేయడం సమాజానికి మంచిది కాదని అన్నారు. పత్రికా రంగంలో ఒక మహిళా జర్నలిస్టు ధైర్యంతో పక్ష పత్రికను నడిపేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. ఏ పత్రికైనా ప్రజలకు ఉపయోగపడే మంచి వార్తలు, వార్తా కథనాలతో ప్రజాధరణ పొందేటట్లు కృషి చేయాలని మామిడి సోమయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కో–కన్వీనర్ బండి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ గౌడ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# చెర్లపల్లి విగ్రహాల తొలగింపు వివాదం

### దళిత సంఘాల పోరాటంతో న్యాయం సాధన

**ఉప్పల్/ చర్లపల్లి, నేడు న్యూస్:** చర్లపల్లి చౌరస్తాలో ప్రముఖ నాయకుల విగ్రహాలను తొలగించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనపై దళిత సంఘాలు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. వెంటనే స్పందించిన స్థానిక నాయకురాలు బొంతు శ్రీదేవి యాదవ్ దళిత సంఘాలతో కలిసి న్యాయం కోసం పోరాటం ప్రారంభించారు. ప్రజల భావోద్వేగాలను గుర్తించిన ఆమె సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ కలిసి మంత్రి శ్రీధర్ బాబుకు విషయం తెలియజేయగా సంబంధిత అధికారులతో చర్చలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. తొలగించిన విగ్రహాలను వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి సాయంత్రానికల్లా విగ్రహాలను విడుదల చేసి పునఃస్థాపన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో దళిత సంఘాలు, స్థానిక ప్రజలు ఉపశమనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్



చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ గ్రామస్తులు, దళిత సంఘాలు, స్థానిక నాయకులు కలిసి చేసిన పోరాటమే న్యాయం సాధించడానికి కారణమని తెలిపారు. ఈ పరిణామాన్ని స్థానిక ప్రజలు స్వాగతిస్తూ సమస్య పరిష్కారంలో భాగస్వాములైన అందరినీ అభినందించారు. సమిష్టి పోరాటం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని ఈ ఘటన స్పష్టంచేసింది.

# దమ్మాయిగూడలో ఆగని అక్రమ నిర్మాణాలు

- టౌన్ ప్లానింగ్ అధికారుల 'మామూలు' నిర్లక్ష్యం?
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని డిప్యూటీ కమిషనర్.. ఫోన్ ఎత్తని టీపీఎస్ స్రవంతి!
- ఆఫీసులో ఉండరు.. విచారణ చేయరు.. ప్రజా ఫిర్యాదులు బుట్టదాఖలేనా?



**కీసర, నేడున్యూస్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కి, ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ భారీ నిర్మాణాలపై స్థానికులు మండిపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో, అక్రమ కట్టడాలకు అధికారుల ఆశీస్సులు ఉన్నాయా అనే అనుమానాలు బలపడుతున్నాయి.

#### అధికారులు నామ్ కే వాస్తే!

దమ్మాయిగూడలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్‌కు స్థానికులు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే, "చూస్తాం.. చేస్తాం" అనే సమాధానం తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. కనీసం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి విచారణ చేపట్టకపోవడం గమనార్హం.

#### కనబడని అధికారులు.. రెస్పాండ్ అవ్వని టీపీఎస్:

కీసర సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీపీఎస్ స్రవంతికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం రెస్పాండ్ అవ్వడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "వారానికి మూడు రోజులు మాత్రమే విధుల్లో ఉంటారు.. ఆ మూడు రోజులు కూడా ఆఫీసులో ఉండరు, ఫోన్ చేసినా లేపరు" అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్లకు రెస్పాండ్ అవ్వకపోవడం, బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక మతలబు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

#### ఉన్నతాధికారుల జోక్యం అవసరం:

నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ కట్టడాలపై అధికారులు మౌనం వహించడం వెనుక భారీగా లంచాలు చేతులు మారాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి, ప్రగతి నగర్‌లోని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దుర్గం శ్రీనాథ్‌గౌడ్ పోరాటం సఫలం

- దమ్మాయిగూడలో ప్రభుత్వ భూమి కబ్జాకు బ్రేక్!
- కబ్జాదారుల గుండెల్లో గుబులు..

దమ్మాయిగూడలో హైడ్రా బోర్డుల కలకలం!




**కీసర, నేడు న్యూస్:** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా కీసర మండలం దమ్మాయిగూడలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. అంజనాద్రి నగర్ కాలనీ పరిధిలోని సర్వే నంబర్ 504లో గల ఖాళీ స్థలాన్ని జిహెచ్ఎంసి ప్రభుత్వ భూమిగా అధికారులు అధికారికంగా ప్రకటించారు. గత కొంతకాలంగా ఈ విలువైన ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడిందని, దీనిని కాపాడాలని స్థానిక సామాజిక కార్యకర్త దుర్గం శ్రీనాథ్ గౌడ్ నిరంతర పోరాటం చేస్తూ వచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దుర్గం శ్రీనాథ్ గౌడ్ పోరాట ఫలితంగా తెలంగాణ ప్రభుత్వానికి చెందిన హైడ్రా విభాగం రంగంలోకి దిగింది. సదరు స్థలంలో "ఇది ప్రభుత్వ భూమి – అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది" అని హెచ్చరిస్తూ భారీ సైన్ బోర్డు ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సెక్యూరిటీ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా కోరల నుండి కాపాడటంలో చొరవ చూపిన దుర్గం శ్రీనాథ్ గౌడ్‌కు స్థానిక కాలనీ వాసులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. సామాజిక కార్యకర్త దుర్గం శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ నేను ఇచ్చిన ఫిర్యాదుకి స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడినందుకు హైడ్రా రంగనాథ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఇలాగే స్పందించి మండలం లోని మిగతా ప్రభుత్వ భూములను కూడా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



## గోల్డెన్ అవర్‌లో బాధితుల ప్రాణాలు కాపాడితే రూ. 25 వేలు పారితోషకం

### రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**మేడ్చల్, నేడు బ్యూరో:** ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ అవర్ లో బాధితులను ఆసుపత్రికి తరలించి, వారి ప్రాణాలు కాపాడిన వారికి రూ. 25 వేల పారితోషకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నాగోల్ లోని ఆర్టీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ' అరైవ్ అలైవ్ ' రోడ్డు భద్రత కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, చిన్న చిన్న నిర్లక్ష్యాలు, పొరపాట్ల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అచేతనంగా బెడ్డుకే పరిమితమైనవారు చాలా మంది ఉన్నారని అన్నారు. ఈ ప్రమాదాల వల్ల వీరే కాకుండా వీరి కుటుంబాలు రోడ్డున పడి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అందుకే ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని మంత్రి పొన్నం పేర్కొన్నారు. మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, ప్రతి వారం ఒక థీమ్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ వారం అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పోలీసు, రవాణ, రెవెన్యూ ఇతర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో, రోడ్డు సేఫ్టీ, ఆక్సిడెంట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనేక కారణాలవల్ల ప్రతి రోజు 400 నుండి 500 వరకు ప్రజలు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారని, ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను బ్లాక్ స్పాట్ గా గుర్తించి అక్కడ కావలసిన మెజర్స్ తో నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తద్వారా ప్రమాదాలను కొంత వరకు నివారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**మేడ్చల్, నేడు బ్యూరో:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మేడ్చల్ జిల్లాలోని కాప్రా మండలం త్రిత్వ, భాస్కర్ న్యూరో కేర్ ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రోగులకు అగ్ని ప్రమాదాలను నివారించే చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, అలాగే అగ్ని మాపక పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.చంద్ర శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### బకాయిల చెల్లింపు, పిఆర్సీ ప్రకటన, హెల్త్ స్కీం అమలు పై డిమాండ్

**ఉప్పల్/ కాప్రా, నేడు న్యూస్:** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఆర్ఎస్ఏ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి కాశిరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్‌కు తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాశిరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వచ్చే జూన్ 2 నాటికి పిఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రకటించిన హెల్త్ స్కీంను వెంటనే అమలు చేసి, అందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని అన్నారు. సాధారణ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదనంగా 61 సంవత్సరాలు పూర్తయిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : టిజిఆర్ఎస్ఏ

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టి జి ఆర్ ఎస్ ఏ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి కాశిరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాప్రా మండల తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ గారికి తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. వచ్చే జూన్ రెండు నాటికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పిఆర్సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా ఉద్యోగులకు హెల్త్ స్కీం వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు, పెన్షనర్లకు హెల్త్ కార్డ్సు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ...

# ఎల్లంపేట పురపాలక సంఘంలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- ముడుపుల కోసమే టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనమా ?
- ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే
- టౌన్ ప్లానింగ్ అధికారిణి సుకన్య పర్యవేక్షణ కరువు

**సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు.. బడా బాబులు అక్రమంగా భారీ భవనాలు నిర్మిస్తున్న సంబంధిత టౌన్ ప్లాన్ అధికారిణి సుకన్య కన్నెత్తి చూడడం లేదని పలువురు ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు వాటి జోలికి వెళ్లాలంటే జంకుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదుల సంఖ్యలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జీ ప్లస్ 2 కి అనుమతులు తీసుకొని ఎలాంటి నిబంధనలు పాటించకుండా రోడ్డుని సైతం ఆక్రమించుకొని జీ ప్లస్ 2 జీ ప్లస్ 3 అక్రమ అంతస్తులపై పెంట్ హౌస్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు జోరు కొనసాగుతుంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న అక్రమ భవన నిర్మాణాలను అరికట్టడంలో సంబంధిత శాఖ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.**

**మేడ్చల్, నేడు న్యూస్ :** ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని పలువురు కౌన్సిలర్ల ఇలాకాలో ఆక్రమ భవనాలు, అక్రమ గోడౌన్ లు యదేచ్ఛగా నిర్మిస్తున్నప్పటికి ఎల్లంపేట పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ అధికారిణి సుకన్య పట్టించుకోవడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ అక్రమ భవనాలు, అక్రమ గోడౌన్ల నిర్మాణాలు నిర్మించడంతో బిల్లర్లు రెచ్చిపోయి పురపాలక సంఘం అనుమతి లేకపోయినప్పటికి మూడు అంతస్థులకు పైగా భవనాలు నిర్మిస్తున్నారు. పురపాలక సంఘం అనుమతితో పని లేదని లిల్లర్లు భవన నిర్మాణ యజమానులను బుకాయించి డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు సైతం తప్పడం లేదు. ముందుగా డబ్బులు తీసుకుని అక్రమ భవనాలు, అక్రమ గోడౌన్లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురపాలక సంఘం అనుమతి తీసుకున్న తర్వాతనే భవనాలు నిర్మించాలి. కానీ అవేమి లేకుండానే అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా భారీ భవనాలను నిర్మిస్తున్నారు. అక్రమ భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని పురపాలక సంఘం అధికారులు హెచ్చరిస్తున్నప్పటికి నిర్మాణదారులు తమ ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారు.



డబిల్ పూర్ గ్రామంలో అనుమతి ఒకలా తీసుకుని నిర్మాణం మరోలా చేపడుతున్న భవనం

**మామూళ్ల మత్తులో :**

గృహ నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో అనుమతి రాకుంటే వచ్చినట్లు భావించి ఇళ్ల నిర్మాణం చేపట్టిన అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత టౌన్ ప్లానింగ్ శాఖ అధికారిణి సుకన్య మామూళ్ల మత్తులో జోగుతూ ఆక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలకడంతో ప్రభుత్వాదాయానికి వారే దగ్గరుండి గండి కొట్టిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. అయినా వీరిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పురపాలక శాఖ పరిధిలో గృహ నిర్మాణ అనుమతులను టీఎస్ బీపాస్ ద్వారా తీసుకుని తర్వాత నిర్మాణాలను చేపట్టాలని చట్టం తెలుపుతున్న టౌన్ ప్లానింగ్ అధికారిణి సుకన్య అండదండలతో అవేమి పట్టించుకోకుండా అనుమతులను తీసుకోకుండా ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి తీసుకోవాలంటే ప్లాటుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉంటే సత్వరమే సంబంధిత అనుమతులు ఇస్తారు. ఆర్ అండ్ బీ అధికారులు స్థలాన్ని పరిశీలించి టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృవీకరణ పత్రాల పరిశీలన చేసి అన్ని సవ్యంగా ఉంటే పురపాలక శాఖ కమిషనర్ లాగిన్ కు పంపిస్తే సంబంధిత నిర్మాణానికి అనుమతి మంజూరు చేస్తారు. ఈ అనుమతి పొందిన మేరకే ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం కాకుండా. చట్టవిరుద్ధంగా ఇళ్ల నిర్మాణం జరిగితే మూడు రోజుల్లోనే ఆ ఇంటి నిర్మాణం కూల్చి వేసి నిర్మాణ ఆస్తి విలువలో 25 శాతం భవన నిర్మాణం యజమాని నుంచి సంబంధిత శాఖ వసూలు చేస్తారు. ఎల్ఆర్ఎస్ అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే నిషేధిత ఆస్తి జాబితాల్లో దాన్ని చేర్చి విద్యుత్, నల్లా కనెక్షన్ తో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న ఇతర సేవలను నిలిపివేస్తారు. ఇళ్లను తనిఖీ చేసేందుకు వెళ్లినప్పుడు అనుమతులు అతిక్రమించి నిర్మిస్తే ఆ నిర్మాణానికి సంబంధించి ఫోటోలు తీసి వీడియో రికార్డు చేసి వందనాన చేస్తారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా గ్రౌండ్ ఫ్లోతో పాటు రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనంగా రెండు, మూడంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. బిల్టర్లు, అక్రమ భవన అంతస్తులు నిర్మాణదారులు టౌన్ ప్లానింగ్ అధికారులను మచ్చిక చేసుకుని ఇష్టానుసారంగా ఆశ్రమ భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికైన ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో చేపడుతున్న అక్రమ భవన నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు టౌన్ ప్లాన్ అధికారిణి సుకన్యపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు ఎల్లంపేట పురపాలక సంఘం ప్రజలు కోరుతున్నారు.



ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న అరుణ గోడౌన్



ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో నిర్మిస్తున్న నిర్మాణం



## మాదారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి, నేడు న్యూస్:** కారేపల్లి మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మొట్టమొదటి సారిగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం రైతులకు ఎంతో మేలు చేసేదిగా ఉందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మధ్యవర్తుల సమస్యలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరేలా ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ. 2,400 మద్దతు ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా మాదారం గ్రామంతో పాటు సమీప ప్రాంతాల రైతులు తమ పంటను ఇక్కడే విక్రయించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి, విద్యుత్ ఏఈ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల మంజుల, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, మాదారం మరియు కొత్తతండా సర్పంచులు అజ్మీరా ఉమా, ధారావత్ మంగీలాల్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## 'సున్నా బాల్య వివాహాలు' లక్ష్యం

**జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత**

**కారేపల్లి. నేడు న్యూస్:** ఈ వేసవి సెలవుల్లో ఒక్క బాల్య వివాహం కూడా నమోదు కాకుండా చూడాల్సిన అవసరం ఉందని జిల్లా సంక్షేమ అధికారిణి డాక్టర్ వేల్పుల విజేత తెలిపారు. పిల్లలు ఆనందంగా, ఆహ్లాదంగా సెలవులను గడపాలని ఆమె సూచించారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలు చేపడుతున్నప్పటికీ కొందరు తల్లిదండ్రులు వివాహ వయస్సుకు ముందే పిల్లలకు పెళ్లిళ్లు చేయడానికి ప్రయత్నించడం ఆందోళనకరమని తెలిపారు. బాలికల సాధికారత కోసం అంగన్వాడీల ద్వారా నిరంతర నిఘ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, భేటీ బచావో బేటీ పడావోసుకన్య సమృద్ధి యోజన" వంటి పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్, ఉమెన్ హబ్ బాధ్యులు సమరీన్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణిలో నిరసన

**కారేపల్లి, నేడు న్యూస్:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఒప్పంద అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర స్థాయి సంయుక్త చర్య కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనల్లో భాగంగా, ఈ రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో కారేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం మండల ఉప తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల స్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్, కేవీ కృష్ణారావు, బానోత్ మంగీలాల్, హరీష్, శ్రీనివాసరావు, మంగీలాల్, శంకర్, మంగ్య, రమేష్, బాలాజీ, బన్సీలాల్, వీరు నాయక్, రాంకోటి, రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, గృహ నిర్మాణ, ఇంజనీరింగ్, వసతి గృహ సంక్షేమ విభాగాలకు చెందిన బాధ్యులు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ప్రజల మనసు గెలిచిన ఎమ్మెల్యే రామదాస్ నాయక్

**గాదెపాడులో సంక్షేమ జల్లు**

**కారేపల్లి. నేడు న్యూస్:** ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రమైన గాదెపాడు గ్రామంలో ప్రజా పాలన -- ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ పాలకుడిని కాదుప్రజల సేవకుడిని" అంటూ ప్రజలతో మమేకమై సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి పథకాల కింద మొత్తం 1615 మందికి చెక్కులను పంపిణీ చేశారు. 2024--25 సంవత్సరానికి 2003 మందికి, 2025--26 సంవత్సరానికి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. రైతు భీమా కింద కోమట్లగూడెం గ్రామానికి చెందిన నంద్యాల కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో మహిళ సంఘ అధ్యక్షురాలు పగడాల మంజుల, ఎస్సై భైరి గోపి, సీఐ నూనావత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మహిళా సాధికారతకు 'నారీ శక్తి వందన్' బిల్లు ఒక మైలురాయి

**: మేడ్చల్ బీజేపీ మహిళా అధ్యక్షురాలు జేకే శైలజహరినాథ్**

**మేడ్చల్, నేడు న్యూస్ :** పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం 'నారీ శక్తి వందన్' బిల్లును ప్రవేశపెట్టడం పట్ల మేడ్చల్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు జేకే శైలజ హరినాథ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మేడ్చల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ మహిళా సాధికారతకు నిజమైన అర్థం ఇచ్చారని కొనియాడారు. మహిళల్లో ఉన్న ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలను గుర్తించి, వారికి రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే సంకల్పంతో ఈ బిల్లును తీసుకురావడం ఎంతో అభినందనీయం. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించే సమయం వచ్చింది అని ఆమె పేర్కొన్నారు.



**రాజకీయాల్లో మహిళలకు నవశకం :**

గతంతో పోలిస్తే ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు మారుతున్నాయని, మహిళలకు విస్తృత అవకాశాలు ఏర్పడుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. కుటుంబ వ్యవస్థలోనే కాకుండా, దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో కూడా మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును ఏకగ్రీవంగా సమర్థించి, ఆమోదించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు సంతోష్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, నరేందర్, ప్రతిభ, కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు. అలాగే మేడ్చల్ మాజీ సర్పంచ్ మురళి గుప్తా, నాయకులు చెరుకము శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, హేమాత రెడ్డి, బాబు రాజ్, సాయి, అర్జున్, నాగరాజు, వెంకటేష్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉసిరికాయలపల్లిలో "టీబీ ముక్త్ భారత్" కార్యక్రమం

**కారేపల్లి నేడు న్యూస్:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా "టీబీ ముక్త్ భారత్" కార్యక్రమాన్ని సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు, గ్రామ అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో పరిశుభ్రత, వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు చేరువ అవుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. టిబి వ్యాధి గుర్తింపు, నివారణపై ఆరోగ్య శాఖ సిబ్బంది సమగ్ర అవగాహన కల్పిస్తూ, అవసరమైన సూచనలు, జాగ్రత్తలు వివరించారు.



గ్రామాన్ని టిబి రహితంగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ తమ ప్రధాన బాధ్యతగా భావిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు చేస్తున్న సేవలను ప్రశంసించారు.




## మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ నిరసన

**52 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్**

**మేడ్చల్ నేడు బ్యూరో:** ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి 29 నెలలు గడిచినా, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఎలాంటి చొరవ చూపకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మేడ్చల్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు జేఏసీ నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రభుత్వం నిరంతరం చిన్న చూపు చూస్తూ, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని వారు మండిపడ్డారు. ప్రభుత్వం పై ఉద్యోగుల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లిందనీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఇక పై సహించేది లేదని, వచ్చే నెల నుంచి ఉదయాన్ని తీవ్రతరం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు (జేఏసీ నాయకులు) జి. వినోద్ కుమార్, జిల్లా జేఏసీ చైర్మన్, టీ.ఎన్.జీ.వో అధ్యక్షులు బి.రవి ప్రకాష్, రమేశ్వర్ గౌడ్ (అడిషనల్ సెక్రటరీ జనరల్), బి. వెంకటేశ్వర్లు (జాయింట్ సెక్రటరీ), సహదేవ్ గౌడ్ (సెంట్రల్ ట్రెజరర్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్), జైసింహ రెడ్డి (జాయింట్ సెక్రటరీ), ధనయ్య, రాజు, ఆనంద్ రెడ్డి, విట్టల్, మధన్ రెడ్డి (సెక్రటరీలు), సుధాకర్ (కన్వీనర్), రామకృష్ణ రెడ్డి (కో-కన్వీనర్), బి. భరత్ కుమార్ (టి.ఎన్.జి.ఓస్ మేడ్చల్ జిల్లా సెక్రటరీ), శేష సాయి గిరికాంత్ (టీఎన్జీవో జిల్లా ట్రెజరర్), జేమ్స్ దాస్ (వైస్ ప్రెసిడెంట్), అశ్విని, సుధీర్ కుమార్ (ఆర్గనైజింగ్ సెక్రటరీలు), శ్రీనివాస్ (మేడ్చల్ యూనిట్ ప్రెసిడెంట్), ఎస్.డి. నజీమా (కుత్బుల్లాపూర్ యూనిట్ ప్రెసిడెంట్), సత్య జ్యోతి (సెక్రటరీ), అరుణ (మల్కాజ్గిరి యూనిట్ టి.ఎన్.జి.ఓస్ ప్రెసిడెంట్), రవి యాదవ్ (షామీర్‌పేట్ యూనిట్ ప్రెసిడెంట్), శాలి పహివాన్ (షామీర్‌పేట్ యూనిట్ సెక్రటరీ), కార్తిక్ (కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్), అక్షయ్ కుమార్ (కలెక్టరేట్ యూనిట్ సెక్రటరీ), బి. రవి ప్రకాష్ గౌడ్ (ఆనిమల్ హస్బండ్రీ ఫోరం జిల్లా ప్రెసిడెంట్), యాదగిరి (సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ప్రెసిడెంట్), వినయ్ (సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఫోరం సెక్రటరీ) వెంకట్ రెడ్డి చంద్రకుమార్ ఉమాకాంత్ కిషోర్ కిరణ్ హర్ష రాజ్ కుమార్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# మరింత పెరిగిన బంగారం ధర



**హైదరాబాద్, ఏప్రిల్ 17 :** భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గత మూడు రోజుల్లో పసిడి ధరలు సుమారు రూ.3 వేల మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,580గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,610గా ఉంది. వెండి ధర దాదాపుగా స్థిరంగానే ఉంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900ల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,670గా ఉంది. ముంబైలో రూ.1,55,580 వద్ద, న్యూఢిల్లీలో రూ.1,55,730 వద్ద కదలాడుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర చెన్నైలో రూ.1,43,610గా, ముంబైలో రూ.1,42,610గా, న్యూఢిల్లీలో రూ.1,42,760గా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వెండి ధరలు రూ.2.69 లక్షల నుంచి రూ.2.74 లక్షల వరకూ ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,787 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 78 డాలర్ల వద్ద కొనసాగుతోంది.






## లాభాల్లో ముగిసిన సూచీలు..

### సెన్సెక్స్ 500 పాయింట్లు పైకి

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు త్వరలో ఓ కొలిక్కి రావొచ్చన్న అంచనాలతో సూచీలు రాణించాయి. సెన్సెక్స్ 505 పాయింట్లు లాభపడి 78,493.54 వద్ద ముగిసింది. నిఫ్టీ 157 పాయింట్ల లాభంతో 24,353.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.93గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్, బీఈఎల్, టైటాన్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 95.54 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,789 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## డగౌట్‌లో ఫోన్..

### రాజస్థాన్ రాయల్స్ మేనేజర్‌కు జరిమానా

ఐపీఎల్ 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ మేనేజర్ రోమి బిందర్ డగౌట్లో మొబైల్ ఫోన్ వాడటం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంలో బీసీసీఐ చర్యలు చేపట్టింది. బిందర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. భవిష్యత్తులో ఐపీఎల్ మ్యాచుల్లో ఇలాంటి ఉల్లంఘనలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించింది. ఇదే తొలిసారి కావడంతో అతడు నిషేధం నుంచి తప్పించుకోగలిగాడు. ఏప్రిల్ 10న గువాహటిలో బెంగళూరు, రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా బిందర్ డగౌట్‌లో ఫోన్ చూస్తూ కెమెరాలకు చిక్కారు. తర్వాత ఆ ఫొటో నెట్టింట్లో వైరల్ అయింది. దీనిపై సీరియస్ అయిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం బిందర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అయితే, అతడి వివరణపై అసంతృప్తి వ్యక్తం చేసిన నిరోధక విభాగం.. క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేసింది. ఆట స్ఫూర్తి దెబ్బతినకుండా ఈ ఘటన ప్రతిఒక్కరికీ ఓ హెచ్చరిక అని బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా వ్యాఖ్యానించారు. 2008 నుంచి రాజస్థాన్ రాయల్స్‌తో బిందర్‌కు అనుబంధం ఉంది. యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి లోకల్ గార్డియన్‌గా వ్యవహరిస్తున్నారు. వైరల్ అయిన ఫొటోలో బిందర్ పక్కన వైభవ్ (ఋఱఎష్ణుజ రాశీశీతీఋఋఅంష్రఱ) కూడా ఉన్నాడు. అతడు కూడా మేనేజర్ ఫోన్‌లోకి చూస్తూ కనిపించాడు. అయితే ఈ క్రికెటర్‌పై మాత్రం బీసీసీఐ చర్యలు తీసుకోలేదు. అతడు ఎలాంటి తప్పుచేయలేదని, లీగ్ రూల్స్‌పై అతడికి మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని భావించింది.



## కోహ్లీ ఒక్క లైక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్

ఒకే ఒక్క లైక్... సోషల్ మీడియానే షేక్ చేస్తోంది. ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తాజాగా మోడల్ లిజ్‌లాజ్ పోస్ట్ లైక్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై నెటిజన్లు నెట్టింట మీమ్స్‌తో హల్చల్ చేస్తున్నారు. ఒక్కసారిగా సదరు మోడల్ పేరు నెట్టింట ట్రెండ్ అయిపోయింది. ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ ఫోటోలతో కూడిన పోస్టును కోహ్లీ లైక్ చేయడం వైరల్‌గా మారింది. ఆమెను ఫాలో కానప్పటికీ లైక్ కొట్టడం చర్చనీయాంశమైంది. జర్మనీకి చెందిన ఈమె 'గోల్డెన్ అవర్ షాట్స్' అంటూ తన ఫోటోలను షేర్ చేసింది. జనవరి 30న పెట్టిన ఈ పోస్టుకు కోహ్లీ లైక్ కొట్టినట్లు కనిపించింది. దీన్ని ఆయన అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అయితే, ఇది అనుకోకుండా జరిగిందా? అల్గారిథమ్ వల్ల జరిగిందా? అంటూ డిబేట్ మొదలెట్టారు. కొందరు ఫన్ ఎమోజీస్‌తో నింపేశారు. అసలు ఆమె ఎవరు? అంటూ తెగ సెర్చ్ చేస్తున్నారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు.

## ఉత్కంఠ పోరులో కోల్‌కతాపై

# గుజరాత్ విజయం



అహ్మదాబాద్: ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ అయిదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ సరిగ్గా 20 ఓవర్లకు 180 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఛేదనకు దిగిన గుజరాత్ టైటాన్స్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. గుజరాత్ బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (86; 50 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. సాయి సుదర్శన్ (22), జోస్ బట్లర్ (25) పరుగులు చేశారు. వాషింగ్టన్ సుందర్ (13), గ్లెన్ ఫిలిప్స్ (19) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. రాహుల్ తెవాతియా 7లి, షారుఖ్ ఖాన్ 3లి నాటౌట్‌గా నిలిచారు. కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 2, వైభవ్ అరోరా, సునీల్ నరైన్, రమణ్‌దీప్ సింగ్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్‌లో కామెరూన్ గ్రీన్ (79; 55 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రోవ్‌మన్ పావెల్ 27 ఫర్వాలేదనిపించాడు. సీఫర్ట్ (19), అజింక్య రహానే (0), రఘువంశీ (8), అనుకుల్ రాయ్ (9), రింకు సింగ్ (1), రమణ్‌దీప్ సింగ్ (17). సునీల్ నరైన్ (0) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ 3, సిరాజ్, అశోక్ శర్మ తలో 2, ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీశారు.

## సన్ రైజర్స్ జట్టుకు గాయాల బెడద

### సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం
### ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే చాన్స్!?



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టును గాయాల బెడద వెంటాడుతూనే ఉంది. తృజాగా ఈ మాజీ ఛాంపియన్ కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లాండ్ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అధికారికంగా ధృవీకరించింది. 35 ఏళ్ల పేన్ ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించాడు. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతను త్వరగా కోలుకోవాలని టీమ్ సభ్యులు ఆకాంక్షించారు. నిజానికి ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్లు గాయపడటం ఇది మొదటిసారి కాదు. అంతకుముందు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ చేతి గాయంతో టోర్నీ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. అతని స్థానంలో శ్రీలంక ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, మూడు ఓటములతో నాలుగో స్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టుకు ఈ గాయాలు ఒక పెద్ద సవాలుగా మారాయి. ప్రస్తుతం జట్టు నెట్ రన్ రేట్ ం0.576 గా ఉంది. ఒకవైపు డేవిడ్ పేన్ దూరం అవ్వడం ఇబ్బంది కలిగించినా, మరోవైపు ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫిట్‌నెస్ టెస్ట్ క్లియర్ చేశాడు. త్వరలోనే అతను స్క్వాడ్‌తో చేరబోతున్నాడు. ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో కమిన్స్ బరిలోకి దిగే అవకాశం ఉంది. కమిన్స్ అందుబాటులో లేని సమయంలో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో టీమ్ రెండు మ్యాచ్‌ల్లో గెలిచి తన ఉనికిని చాటుకుంది. గత సోమవారం టేబుల్ టాపర్స్ రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన ఎస్ఆర్‌హెచ్, ప్రత్యర్థిని 159 పరుగులకే కట్టడి చేసింది. అరంగేట్రం చేసిన యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ చెరో నాలుగు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించారు. 57 పరుగుల తేడాతో గెలిచిన ఆరెంజ్ ఆర్మీ ఇప్పుడు ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉంది. శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. హోమ్ క్రౌడ్ ముందు రుతురాజ్ సేనను ఓడించి విజయ పరంపరను కొనసాగించాలని హైదరాబాద్ ప్లాన్ చేస్తోంది. సొంతగడ్డపై రాయల్స్ పై గెలుపొందడం, చెన్నైతో మ్యాచ్ కూడా సొంతగడ్డపైనే జరుగనుండటంతో ఈ విజయంపై కన్నేసింది. ఇక డబుల్ హెడర్ లో భాగంగా శనివారం రాత్రి ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ పై ఫుల్ క్రేజ్ ఉండగా, టికెట్లకు భారీ డిమాండ్ ఉంది.



## బంగారం, వెండి దిగుమతుల కోసం 15 బ్యాంకులకు కేంద్రం అనుమతి

**న్యూఢిల్లీ :** ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ వంటి 15 బ్యాంకులకు బంగారం, వెండి దిగుమతులు చేసుకోవడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయి. యూనియన్ బ్యాంక్, స్బెర్ బ్యాంకులకు కేవలం బంగారం మాత్రమే దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది.

**బ్యాంకుల జాబితా**

యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, డాయిష్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంక్ లిమిటెడ్ ఈ జాబితాలో ఉన్నాయి. అంతకుముందు భారతీయ బ్యాంకులు బంగారం, వెండి దిగుమతులను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. బులియన్ దిగుమతులకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో టన్నుల కొద్దీ లోహాలకు కస్టమ్స్ క్లియరెన్స్ లభించలేదని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2025 ఏప్రిల్‌లో చివరగా ప్రభుత్వం ఈ దిగుమతులకు అధికారిక అను మతులు ఇవ్వగా.. మార్చి 31తో వీటికి గడువు పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల కోసం బ్యాంకులు ఎదురుచూస్తున్న వేళ మూడేళ్ల పాటు దిగుమతులకు అనుమతిస్తూ కేంద్రం నుంచి నోటిఫికేషన్ రావడం గమనార్హం.



## అంబానీని దాటేసిన అదానీ..

### ఆసియాలో నం.1

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఆసియాలో అత్యంత సంపన్నుడిగా అవతరించారు. గత కొన్నేళ్లుగా ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీని గౌతమ్ అదానీ దాటేశారు. వీరిద్దరూ ప్రపంచ టాప్-20 అత్యంత సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్నట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్ ఇండెక్స్ పేర్కొంది. గౌతమ్ అదానీ సంపద 92.6 బిలియన్ డాలర్లు కాగా.. ముకేశ్ అబానీ సంపద 90.8 బిలియన్ డాలర్లుగా ఉంది. అదానీ గ్రూప్ స్టాక్స్ ఇటీవల పెరగడంతో అదానీ అత్యంత సంపన్న వ్యక్తిగా నిలిచారు. అదానీ పవర్ 1 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 2 శాతం, అదానీ ఎనర్జీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌తో పాటు ఇతర కంపెనీల స్టాక్స్ నేటి ట్రేడింగ్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. స్టాక్ ధరలు, వ్యాపార పనితీరు ఆధారంగా ఈ ర్యాంకులు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

**మళ్లీ ఎలాన్ మస్క్**

ఇక అంతర్జాతీయంగా చూసినప్పుడు.. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 656 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా నంబర్ 1 స్థానం దక్కించుకున్నారు. ల్యారీ పేజ్ (286 బిలియన్ డాలర్లు), జెఫ్ బెజోస్ (269 బి.డా), సెర్గే బ్రిన్ (266 బి.డా), మార్గ్ జుకర్‌బర్గ్ (239 బి.డా), ల్యారీ ఎల్లిసన్ (230 బి.డా), మిచెల్ డెల్ (170 బి.డా), జెన్‌సెన్ హువాంగ్ (164 బి.డా), బెర్నార్డ్ ఆర్నాల్ట్ (164 బి.డా), జిమ్ వాల్టన్ (150 బి.డా) టాప్-10 జాబితాలో ఉన్నారు. గౌతమ్ అదానీ 19, ముకేశ్ అంబానీ 20వ స్థానంలో కొనసాగుతున్నారు. భారత్ నుంచి లక్ష్మీ మిత్తల్, శివ్ నాడార్, షాపూర్ మిస్త్రీడ కుటుంబం, సావిత్రి జిందాల్, సునీల్ మిత్తల్‌డ కుటుంబం, అజీమ్ ప్రేమ్‌జీ, కుమార మంగళం బిర్లా, రాధాకృష్ణ ధమానీ బిలియనీర్ ఇండెక్స్‌లో కొనసాగుతున్నారు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com